

15రోజులు ముందు నుంచే సందడి



ఆనాడు బతుకమ్మ పండుగ అంటే 15 రోజుల నుండే సందడి మొదలయ్యేది. ఆ పది రోజులు రోజుకో ఒక తీరుగా బతుకమ్మను పేర్చి రోజుకో ప్రసాదాలను తయారు చేసి చెరువులో నిమజ్జనం చేసేటప్పుడు వాయనాలు ఇవ్వడం గొప్ప అనుభూతి. ఆ రోజుల్లో మేము బతుకమ్మ చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొట్టి బతుకమ్మ పాటలు పాడే వారం. ఆ పాటలు వినడానికి ఊరంతా ఒక దగ్గరకు వచ్చేది ఆ రోజులే వేరు. – గాజుల కావ్య, రామచంద్రపురంకాలనీ

పూలనే దేవుడిగా కొలిచే పండుగ



బతుకమ్మ సంప్రదాయంలోని చాలా విశేషాలు మా అమ్మ నాకు తెలిపారు. పూలు చాలా పవిత్రమైన దేవతా స్వరూపంగా భావించేవారు. పూలనే దేవతల కొలిచే ఒక విశిష్టమైన పండుగ బతుకమ్మ. పెద్దవాళ్ల నుంచి నేను అనేక విషయాలు నేర్చుకున్న. బతుకమ్మ ఒక భగవత్ స్వరూపం. – పింగలి లేదుశ్రీ, సప్తగిరికాలనీ

బతుకమ్మ ఒక పెద్ద సంబరం



బతకమ్మ ఒక పెద్ద సంబరం. మా చిన్నప్పుడు బాగా ఆడే వాళ్లం. పిల్లలుగా సంబరపడే వాళ్లం. అమ్మ దగ్గరి నుంచి బతకమ్మ పాటలు నేర్చుకున్న. తొమ్మిది రోజులు సందడిగా ఉండేది. ఆ రోజుల్లో బతుకమ్మ మరుపు రాని జ్ఞాపకం. – పొన్నం సువర్ణ, కొత్తపల్లి

క్లుప్తంగా

కాలేయ వ్యాధుల నియంత్రణకు వ్యాక్సినేషన్



హెపటైటిస్ బి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

కరీంనగర్‌టౌన్: కాలేయ వ్యాధుల నియంత్రణకు హెపటైటిస్ బి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో వెంకటరమణ తెలిపారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ తఖియొద్దీన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రిలో వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 1,166 సిబ్బందికి ఇవ్వాల్సి ఉండగా సోమవారం 120 మంది వైద్యాధికారులు, సిబ్బందికి ఇవ్వడం జరిగిందన్నారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఆర్‌ఎంవో నవీన, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి పాల్గొన్నారు.

సంఘ వికాసంతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ రమణాచారి

కరీంనగర్‌టౌన్: సంఘ వికాసంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచారి అన్నారు. నగరంలోని సరస్వతి శిశు మందిర్‌లో వారం రోజులపాటు జరుగుతున్న శిక్షావర్గ ప్రారంభ ఉపన్యాస కార్యక్రమంలో మాట్లాడారు. దేశాన్ని మాతృభూమిగా ప్రేమించే స్వయంసేవకుల్లో అనుశాసనం, దేశభక్తి, సేవాభావం వంటి గుణాల నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ శాఖలో జరుగుతుందని వివరించారు. శిక్షణకు వచ్చిన స్వయంసేవకులు గ్రామీణ క్షేత్రాల్లో సంఘ శాఖల నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ సత్యనారాయణ, మల్లోజుల కిషన్‌రావు, శిక్షణకు వచ్చిన స్వయంసేవకులు పాల్గొన్నారు.

6,273 అర్జీలకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలకసంస్థ పరిధిలో 6,273 దరఖాస్తులకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. కరీంనగర్, కొత్తపల్లి, మల్కాపూర్, లక్ష్మీపూర్, చింతకుంట, పద్మనగర్, అల్గునూర్, సదాశివపల్లి, బొమ్మకల్, దుర్శెడ్, గోపాలపూర్, వల్లంపహడ్, తీగలగుట్టపల్లి, ఆరెపల్లి, రేకుర్తి, సీతారాంపూర్‌లకు సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్–2020 దరఖాస్తుల్లో 8,734 మంది ఫీజులు చెల్లించారన్నారు. 590 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వివిధ కారణాల వల్ల 1,610 దరఖాస్తులు సిటిజన్ లాగిన్‌కు తిరిగి పంపించిబడ్డాయన్నారు.

వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపల్లి: చింతకుంట శ్మశానవాటికలో పడేసిన వినాయక ప్రతిమల వ్యర్థాలను సోమవారం తొలగించారు. 'చింతకుంట శ్మశానంలో వ్యర్థాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక అధికారులు స్పందించారు. అలాగే శ్మశానవాటికలో చెత్తను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఆవేదనల నివేదనలు

- ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు
- పరిష్కరించాలని వేడుకోలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు

కరీంనగర్‌అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు ప్రజావాణిని ఆశ్రయించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అత్యధికం వచ్చిన ఫిర్యాదులే మళ్లీ మళ్లీ రావడం విశేషం. సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించామని కాగితాల్లో చూపుతుండగా ఆచరణలో మాత్రం విరుద్ధ పరిస్థితి అని అర్జీదారులు వాపోతున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, నివేసన స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు రాగా పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ చొరవ చూపారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ అర్జీలు స్వీకరించగా, మొత్తం 318 దరఖాస్తులు వచ్చాయని కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించగా తమ ఆవేదనను వివరించారు. వివరాలు వారి మాటల్లోనే..

నిధుల దుర్వినియోగంపై చర్యలేవీ?



గ్రామ పంచాయతీల నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేస్తే ఏళ్లుగా నాన్చుతున్నారు. పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేయాల్సిందిపోయి అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. పనులు చేయకున్నా చేసినట్లు దొంగ రికార్డులు సృష్టించి ఎంబీలు రూపొందించారు. సుమారు రూ.16లక్షలు దుర్వినియోగం చేశారు. కలెక్టర్ తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలి.
– సీతంపేట గ్రామస్తులు, ఇల్లందకుంట

కొడుకు కొడుతుండు



మాది పేద కుటుంబం. ఇద్దరు కొడుకులను పెంచి పెద్ద చేసిన. పెద్ద కొడుకు గల్ఫ్‌లో ఉంటుండగా చిన్నకొడుకు ఊళ్లోనే ఉంటూ అప్పులు చేస్తూ మమ్మల్ని వేధిస్తున్నాడు. మా బాగోగులు చూసుకోకుండా డబ్బుల కోసం చిత్రహింసలు పెడుతున్నాడు. ఉన్నపాటి చిన్న ఇల్లును అమ్మాలని నానాబూతులు తిడుతూ కర్రలతో కొడుతున్నాడు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం ప్రకారం నాకు భద్రత కల్పించాలి.
– మల్లయ్య, రుద్రారం, రామడుగు

నాకిదేం గోస



గ్రామ శివారులోని సర్వే నంబర్ 479లో 20గుంటల భూమి ఉంది. వారసత్వంగా భూమి సంక్రమించగా దశాబ్దాలుగా సాగు చేస్తున్నాం. ధరణి రాకముందు పట్టాదారు పాసుపుస్తకం ఉండగా ధరణి వచ్చిన తర్వాత సంబంధం లేని వ్యక్తుల పేరున వస్తోంది. భూభారతి వచ్చినా నా సమస్య తీరడం లేదు. మోకాపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు.
– నీలం పోచమ్మ, పోరండ్ల, తిమ్మాపూర్

దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం



బ్రహ్మీ అలంకరణలో..



అమ్మవారికి గంగాహారతి



హరిహర క్షేత్రంలో..



టవర్ సర్కిల్‌లో..



బొమ్మకల్‌లో..

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో సోమవారం దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభయ్యాయి. పలు కూడళ్లు, ఆలయాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత కొలువుదీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాభవానీ ఆలయంలో..

విద్యానగర్(కరీంనగర్): నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో సోమవారం దుర్గాభవానీ శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు దుర్గాభవానీ అమ్మవారు బ్రహ్మీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. కలశస్థాపన, చతుషష్ట్యుపచార, కన్యాసువాసినీ పూజలు జరిగాయి, చండీహోమం నిర్వహించి అమ్మవారికి గంగా హారతులిచ్చారు. పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, అన్నప్రసాద ట్రస్టు బాధ్యులు పల్లెర్ల శ్రీనివాస్, రాచమల్ల ప్రసాద్, వేణుగోపాల్, అశోక్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, వినోద్, ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు



నిమజ్జన పాయింట్లు పరిశీలిస్తున్న కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: బతుకమ్మ నిమజ్జనానికి ఆయా పాయింట్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని నిమజ్జన పాయింట్లను ఆయన ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా పాయింట్ల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనం ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీటి సదుపాయం కల్పించాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్యం పగడ్బందీగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి శుభ్రం చేయాలన్నారు.

నాలా మరమ్మతు పనులు పరిశీలన

నగరంలోని కాశ్మీర్‌గడ్డలో ఇటీవల కూలిన నాలా మరమ్మతు పనులను నగరపాలకసంస్థ కమిషనర్ పరిశీలించారు. నాలాను త్వరితగతంగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న నగరంలోని ఇతర డ్రైనేజీలకు సంబంధించిన అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారును ఆదేశించారు.

రాంలీలా ఘనంగా నిర్వహిద్దాం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని మార్క్‌ఫెడ్ మైదానంలో నిర్వహించే రాంలీలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం మార్క్‌ఫెడ్ మైదానాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రావణ కటౌట్ నిర్మాణానికి, రాంలీలా ఏర్పాట్లకు భూమిపూజ నిర్వహించారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మార్క్‌ఫెడ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్‌రావు, మాజీ కార్పొరేటర్‌లు శ్రీకాంత్, మహేష్, రాంనగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకెళ్లాలి

కరీంనగర్: మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

బతుకమ్మ వేడుకలు



ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాలలో ..



బతుకమ్మ వేడుకల్లో అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి, డాక్టర్ వనజారెడ్డి

కరీంనగర్: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాలలో సోమవారం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర సంప్రదాయాన్ని ప్రతిబింబించే ప్రధాన పండుగ అన్నారు. బతుకమ్మ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ పాటలతో నృత్యాలు చేస్తూ కనువిందు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సత్యవర్ధన్ రావు, సీనియర్ అధ్యాపకురాలు వి.ప్రమీల, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: కొత్తపల్లిలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. బా పూజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు పొన్నం సత్యంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు ఒకేరకం వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు.

జస్టిస్ కుమారయ్య న్యాయ కళాశాలలో..

మల్కాపూర్‌లోని జస్టిస్ కుమారయ్య న్యాయ కళాశాలలో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ కె.జలజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో న్యాయ విద్యార్థినులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో..

వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్ మైదానంలో అల్ఫోర్స్ బతుకమ్మ మహోత్సవ్ పేరిట నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, వనజారెడ్డి దంపతులు బతుకమ్మకు పూజ చేసి వేడుకలు ప్రారంభించగా.. ఉపాధ్యాయినులు, సిబ్బందితో బతుకమ్మ పాటలకు స్టెప్పులేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



జస్టిస్ కుమారయ్య న్యాయ కళాశాలలో..



కొత్తపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



వర్షను అభినందిస్తున్న మనోహర్‌రెడ్డి

కరీంనగర్: అండర్–19 ఎస్జీఎఫ్ చదరంగం పోటీల్లో కరీంనగర్ ట్రినిటీ కళాశాల విద్యార్థిని ఎం.వర్ష, అండర్–19 ఎస్జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థి ఏ.రాఘవ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ట్రినిటీ కళాశాలల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో పతకం

కరీంనగర్‌రూరల్: వనపర్తి జిల్లాలో ఇటీవల జరిగిన 11వ సీనియర్స్ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టులో తీగలగుట్టపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎస్. శ్రీవర్ష, ఎండీ సుహానాలు పాల్గొని పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు కరుణ, పీఈటీ అజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించినట్లు వివరించారు.

ఈ పాస్ మిషన్లలో సాంకేతిక సమస్య

- యూరియా పంపిణీ నిలిపివేత
- ఆందోళనలో రైతులు




చెర్లభూత్కూర్ గోదాం ఎదుట కూర్చున్న రైతులు

కరీంనగర్‌రూరల్: 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది రైతుల పరిస్థితి. ఇప్పటికే రైతాంగాన్ని యూరియా కొరత వేధిస్తుండగా కొత్తగా ఈపాస్ మిషన్లలో నెలకొన్న సాంకేతిక సమస్యతో రెండు రోజుల నుంచి యూరియా పంపిణీలో నెలకొన్న ఇబ్బందులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం 11గంటల నుంచి ఈపాస్ మిషన్లు పనిచేసినప్పటికీ సోమవారం పూర్తిగా పనిచేయక పోవడంతో అధికారులు యూరియా పంపిణీ నిలిపేశారు.

వారం రోజులకు యూరియా స్టాక్

వారం రోజుల అనంతరం దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘంకు 15 మెట్రిక్ టన్నులు, చెర్లభూత్కూర్ గోదాంకు 15 టన్నులు, బొమ్మకల్ గోదాంకు 5 టన్నుల యూరియా స్టాక్ వచ్చింది. సోమవారం ఉదయం 8గంటల నుంచే ఆయా కేంద్రాల వద్దకు సమీప గ్రామాలకు చెందిన రైతులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అంతకు ముందు ఏఈవోలు జారీ చేసిన టోకెన్లు ఉన్న రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు సిబ్బంది సిద్ధమయ్యారు. అయితే రైతుల ఆధార్‌కార్డు వివరాలను ఈపాస్ మిషన్‌లో నమోదు చేయగానే సాంకేతిక సమస్యతో ఎర్రర్‌గా వస్తుండటంతో సిబ్బంది యూరియా పంపిణీ తాత్కాలికంగా నిలిపివేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. అయితే ఈ పాస్‌మిషన్లను అప్‌డేట్ చేయాలంటే సొసైటీల సీఈవోలు వేలిముద్రలు వేయాల్సి ఉండగా డీసీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. చివరకు మధ్యాహ్నం 3గంటల నుంచి ఈ పాస్ మిషన్లు పనిచేయడంతో బొమ్మకల్‌లో మాత్రం సాయంత్రం 4గంటల నుంచి రైతులకు యూరియా పంపిణీ చేయగా దుర్శేడ్, చెర్లభూత్కూర్ కేంద్రాల్లో నిలిపివేశారు. సోమవారం సర్వర్ సక్రమంగా పనిచేయక పోవడం, నెట్‌వర్క్ లేకపోవడంతో యూరియా పంపిణీ నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రదర్శనలతో విజ్ఞానం



ప్రదర్శన తిలకిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా 'యువర్ సేఫ్టీ జస్ట్ ఏ క్లిక్ అవే' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అవయవాల నమూనా ప్రదర్శన ఏర్పాటు చేయగా కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగ్ర శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ విశ్వనాథ బాలకిషన్ ప్రారంభించారు. ప్రదర్శనలో అవయవాల నమూనాలను విద్యార్థులు విపులంగా వివరించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం మరింత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, విభాగాధిపతి శ్రవణ్ కుమార్, సిబ్బంది శ్రావణ్ కుమార్, రేఖ ఠాకూర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఆదివాసి శిక్షణా శిబిరాలు

కరీంనగర్ కార్పొరేషన్: ఈనెల 25వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉమ్మడి జిల్లాస్థాయి ఆదివాసి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పీసీసీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ కోట్యానాయక్ తెలిపారు. సోమవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 25,26, 27 తేదీల్లో డీసీసీ కార్యాలయంలో ఆదివాసి సెల్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణా శిబిరం ప్రారంభ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరవుతారన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

సప్తగిరికాలనీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో సోమవారం మేధో సంపత్తి హక్కులు, పేటెంట్స్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు మేధా సంపత్తి విశిష్టత, మానవ మేధస్సును ఏ రకంగా రక్షణ కల్పించవచ్చు, కాపీరైట్స్ లక్షణాలు, పరిశోధనలో పేటెంట్స్‌ని ఎలా ఫైల్ చేయాలో తెలుపుతూ వ్యక్తిగత హక్కులను ఇండియన్ పేటెంట్స్ గురించి వివరించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు కరీంనగర్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన టెన్త్ పరీక్షలకు 82శాతం, మధ్యాహ్నం జరిగిన ఇంటర్ పరీక్షలకు 100శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం మొండయ్య తెలిపారు.

ప్రీస్కూల్ మేళా

విద్యానగర్(కరీంనగర్): పోషణ మాసంలో భాగంగా సోమవారం కరీంనగర్ కార్ఖానగడ్డ అంగన్‌వాడీ మొదటి కేంద్రంలో ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ మున్నీసా, ఆయా అనిత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని రాష్ట్ర బీసీ, సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు పొన్నం సత్యనారాయణ, కటకం వెంకట రమణ, ఇమ్రాన్, బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నూతన వస్త్రాలు అందజేత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సోమవారం తన సొంత ఖర్చులతో నూతన వస్త్రాలను మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ అందజేశారు. ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు షాబీర్ పాషా, మాజీ ఎంపీటీసీ కమల మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాలా పనులు పూర్తిచేయాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని కశ్మీర్‌గడ్డలో ఇటీవల కూలిన నాలా మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం నాలా పనులను పరిశీలించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ తుల శ్రీదేవి చంద్రమౌళి ఉన్నారు.

నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న రాసపల్లి సరిత నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైందని శారద ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమలమనోహర్ తెలిపారు. హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో 25న సొసైటీ ఆధ్వర్యంలో అవార్డు అందజేయనున్నామన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘం

కరీంనగర్‌కార్పొరేషన్: సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచే పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ నాయకుడు వుట్కూరి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 45వ డివిజన్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు పంపిణీ చేశారు.

స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర

కరీంనగర్: దేశ స్వాతంత్ర్యం కోసం ఏర్పడి ఉద్యమించిన దేశంలోనే మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ కళాశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, నాయకులు మచ్చ పవణ్, అభి, అక్షయ్, ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలపై అవగాహన

కొత్తపల్లి: కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులకు సోమవారం వ్యర్థాలపై అవగాహన కల్పించారు. పొడి, తడి, బయో మెడికల్, నిర్మాణ, రసాయన వ్యర్థాలు వంటి వివిధ రకాల వ్యర్థాలను గుర్తించడం, వర్గీకరించడం, వాటిలోని పారవేసే వ్యవస్థను లలిత్ మోహన్‌సాహూ మార్గదర్శకత్వంలో 9వ తరగతి విద్యార్థులు జి. అదితి, ఎస్.సాన్విక, మీహా ముబారక్, వి.అమోఘ్ సాయి, ఎస్.జయకృష్ణలు సామాజిక అవగాహనను తీసుకువచ్చారు. పాఠశాల చైర్మన్ ఇ.ప్రసాద్ రావు, పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, హనుమంతరావు, ప్రిన్సిపాల్ గోపికృష్ణ, సమన్వయకర్తలు రవీంద్ర పాత్రో, భవాని, నిఖితలు అభినందించారు.

జీఎస్టీ తగ్గింపు హర్షణీయం

కరీంనగర్‌టౌన్: వస్తు సేవలపై పన్ను (జీఎస్టీ) తగ్గించడంపై వినియోగదారులు, వ్యాపారులు, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వస్తు సేవల పన్ను తగ్గింపు అమలులోకి వచ్చిన సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు జాడి బాల్‌రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డిలు కిరాణాషాపులు, టీవీ షోరూం, బుక్‌స్టాల్, మెడికల్ స్టోర్‌లను సందర్శించి వినియోగదారులతో మాట్లాడారు.